సాక్షి నాగర్‌కర్నూల్

సోమవారం । 16 । జూన్ । 2025



'కురుమూర్తి'కి మహర్దశ

పేదల తిరుపతిగా విరాజిల్లుతున్న కురుమూర్తి స్వామి ఆలయ రూపురేఖలు మారనున్నాయి.

వివరాలు 8లో ▸



మునిగిన పంటలు

కృష్ణానదికి వరదలు రావడంతో పరివాహక ప్రాంతంలో వేసిన పంటలు నీట మునిగాయి.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0 /21.9

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

26న కంటి ఉచిత శస్త్రచికిత్స శిబిరం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26న కంటి ఉచిత శస్త్రచికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆప్తాలమిక్ అధికారి కొత్ర బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనం గది నం.102లో కంటి శిబిరం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు కొనసాగుతుందన్నారు. శిబిరంలో రోగులకు ప్రత్యేక కంటి పరీక్షలు, సాధారణ పరీక్షలు నిర్వహించి, అందులో అవసరమైన వారికి, క్యాటరాక్టు పొర గల వారికి ఉచితంగా ఆపరేషన్లు మహబూబ్‌నగర్‌లోని ఏనుగొండ రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో చేస్తారన్నారు. రోగులు ముందుగా బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకొని రిపోర్టు తీసుకురావాలన్నారు. అలాగే ఆధార్, రేషన్, ఓటరు కార్డులో ఏదేని ఒక గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీ తమ వెంట తెచ్చుకోవాలని చెప్పారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్లు 94408 76556, 73869 40480లను సంప్రదించాలని సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



చారకొండ: కార్యకర్తల కృషి వల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే, సీడ బ్లాసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లిలో చల్లా వంశీచంద్‌రెడ్డి ఆయన నివాసంలో వెల్దండ ఉమ్మడి మండలం కాంగ్రెస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి, ఇతర పథకాలను గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీలో కష్టకాలంలో పనిచేసిన నిఖార్సైన కార్యకర్తలను పార్టీ గుర్తిస్తుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నేతృత్వంలో గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ నాయకులు కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. యుజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్, నాయకులు రమేష్, శ్రీను, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

సుదీర్ఘ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు

ఉండవెల్లి: సుదీర్ఘ 60 ఏళ్ల న్యాయ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు కేంద్ర, రాష్ట్రాల్లో ప్రవేశపెట్టడం ఉద్యమంలో కీలకం అని ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ పోరాటం మాలలకు వ్యతిరేకం కాదని, అన్ని కులాలకు సమన్వయంగా ఉంటామని అన్నారు. ఆదివారం మండలంలోని కలుగోట్ల గ్రామంలో మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ విగ్రహావిష్కరణలను మంద కృష్ణతోపాటు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఐజీ సుమతి ఆవిష్కరించారు. దేశంలో రాష్ట్రపతిగా కేఆర్ నారాయణ్ ఉన్న సమయంలో ఎస్సీ వర్గీకరణకు తీర్మానం చేశారని, గతంలో వర్గీకరణ అంశాన్ని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ కమిషన్ వేశారన్నారు. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వంలో ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ పోరాటం న్యాయమే అని భావించి.. మాదిగలకు అండగా నిలిచారన్నారు.

'కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ మాయల మాంత్రికుడు వనపర్తి జిల్లాకేంద్రంలో ఉంటూ మంత్రగాడిగా చెలామణి అవుతున్నాడు. తాను గుప్తనిధులను వెలికితీస్తానని నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రానికి చెందిన ఓ కుటుంబాన్ని నమ్మించాడు. జిల్లాకేంద్రం నడిబొడ్డున ఉన్నవారి సొంత ఇంట్లోనే ఉన్న బంగారాన్ని బయటకు తీస్తానని చెప్పి రూ.5 లక్షల వరకు వసూలు చేశాడు. బాధితులు ఇంట్లో ఎంత లోతు తవ్వినా లంకె బిందెల జాడ కనిపించలేదు. జిల్లాలో ఇలాంటి ఘటనలు తరచూగా చోటుచేసుకుంటున్నాయి. వీరిలో చాలామంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు **చేసేందుకు సైతం వెనకడుగు వేస్తున్నారు.**

జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు, గద్వాల, రాజోలి మండలాలతోపాటు నల్లమలలోని పురాతన ఆలయాల్లో గుప్తనిధుల తవ్వకాలు నిత్యకృత్యంగా మారాయి. గతేడాది డిసెంబర్ 15న గట్టు మండలం చిన్నంపల్లిలో కొందరు వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరపగా, స్థానికుల సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటి వరకు నిందితులను పట్టుకోలేదు. గతేడాది జూన్‌లో గద్వాల మండలం పూడూరులోనూ గుప్తనిధుల తవ్వకాలు చోటుచేసుకున్నాయి. మూడేళ్ల కిందట ఏకంగా జిల్లాకేంద్రంలోని గద్వాల కోటలోనే దుండగులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరపడం **జిల్లాలో పరిస్థితికి అద్దం పడుతోంది.**

అమాయకులకు వల

గుప్తనిధులు, లంకె బిందెల పేరుతో నిలువుదోపిడీ



- అడ్డొచ్చిన వారిని హతమార్చేందుకు వెనకాడని మాయగాళ్లు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెరుగుతున్న దందాలు
- అత్యాశకు పోయి ఉన్న సొత్తును కోల్పోతున్న వైనం
- పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సైతం వెనకడుగు

సాక్షి, నాగర్‌కర్నూల్: 'మాయలు, మంత్రాల పేరుతో గుప్తనిధులు వెలికితీస్తానని నమ్మిస్తూ ఆస్తులను కాజేయడంతోపాటు అడ్డొచ్చిన వారిని హతమార్చిన ఘటన గతేడాది నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో సంచలనం రేపింది. జిల్లాకేంద్రానికి చెందిన సత్యనారాయణయాదవ్ గుప్తనిధులను వెలికితీసే పేరుతో అమాయకులను నమ్మించి, ఉన్న ఆస్తులను కాజేస్తూ ఏకంగా 11 మందిని హత్య చేసిన ఉదంతం రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించింది. గుప్తనిధులను వెలికితీస్తానని, అందుకు వారి పేరిట ఉన్న భూములను తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని నమ్మించి, తర్వాత అమాయకులను మట్టుబెట్టడంలో ఈ మాయగాడు ఆరితేరాడు. నిందితుడిని అరెస్ట్ చేయడంతోపాటు పోలీసులు మూఢనమ్మకాలపై అవగాహన కల్పిస్తున్నా.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గుప్తనిధుల మాటున మోసాలు కొనసాగుతూనే ఉన్నాయి.'

ఉమ్మడి పాలమూరులో ఇంకా మూఢనమ్మకాల జాఢ్యం వీడటం లేదు. మంత్రాలు, మాయలు, గుప్తనిధుల పేరుతో మాయగాళ్లు రెచ్చిపోతున్నారు. అమాయకులకు ఆశ చూపుతూ అందినకాడికి దండుకుంటున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మాయగాళ్లను నమ్మి పెద్దఎత్తున సొమ్మును కోల్పోయి మోసపోతున్న ఘటనలు పెరుగుతున్నాయి. మూఢనమ్మకాల నిర్మూలనలో పోలీసులు, సంబంధిత అధికారులు చేస్తున్న కార్యక్రమాలతో ఆశించిన ప్రయోజనం ఉండటం లేదు. చాలా సందర్భాల్లో గుప్తనిధుల తవ్వకాలకు పాల్పడిన నిందితులు, సూత్రదారులు పోలీసులకు చిక్కడం లేదు.

మాయగాళ్లు, నాటువైద్యులు

ఉమ్మడి జిల్లాలో మాయగాళ్లు, నాటు వైద్యులను ఆశ్రయించే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. దీంతో అమాయకులే లక్ష్యంగా చేసుకుని మాయగాళ్లు అందినకాడికి దోచుకుంటున్నారు. చిన్నపిల్లలతోపాటు మహిళలు, వృద్ధులు అనారోగ్యానికి గురైనా తాయత్తులు, బిళ్లలు కడతామంటూ రోజుకొకరు చొప్పున మాయగాళ్లు పుట్టుకొస్తున్నారు. ప్రధానంగా నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో కొందరు వ్యక్తులు మంత్రాలు, నాటు వైద్యం పేరుతో వ్యవస్థీకృతంగా దందా నడిపిస్తున్నారు. ఈ క్రమంలో మోసపోయిన బాధితులు కొన్నిసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా.. వారిపై చర్యలు తీసుకోకుండా మాయగాళ్లకే సహకరించిన ఘటనలే ఎక్కువ.

ఆలయాల విధ్వంసం..

ఉమ్మడి జిల్లాలోని పురాతన ఆలయాలను లక్ష్యంగా చేసుకుని గుప్తనిధుల తవ్వకాలు చేపడుతూ అపురూపమైన విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారు. ఇప్పటికే నల్లమలలోని పురాతన నవ నారసింహ ఆలయం, ప్రతాప రుద్రుని కోట, రాయలగండి చెన్నకేశవ ఆలయం, బైరాపూర్, వడ్డేమాన్‌లోని పురాతన ఆలయాల్లో దుండగులు తవ్వకాలు జరిపి విగ్రహాలను ధ్వంసం చేశారు. అమూల్యమైన పురాతన విగ్రహాలు, ఆలయాలను పరిరక్షించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పోలీసులకు ఫిర్యాదు చేయండి..



ప్రజలు మాయలు, మంత్రాలు, మూఢ విశ్వాసాలను నమ్మకుండా, వాటి పేరుతో జరుగుతున్న మోసాల పట్ల ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలి. గుప్తనిధులు, మంత్రాలు మోసపూరిత మాటలని గ్రహించాలి. మోసగాళ్లకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలి. నేరుగా పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయాలి.

– రామేశ్వర్, ఏఎస్పీ, నాగర్‌కర్నూల్



నల్లమలలోని నవ నారసింహ ఆలయంలో గుప్తనిధుల తవ్వకాలు (ఫైల్)

పాలనలో ముద్ర



నల్లమలలో పర్యటిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్ (ఫైల్)

- కలెక్టర్‌గా ఏడాది పూర్తి చేసుకున్న బదావత్ సంతోష్
- నిత్యం సమీక్షలతో అధికారులకు దిశానిర్దేశం
- పదో తరగతి ఫలితాల పెరుగుదలకు కృషి
- విజయవంతంగా అధికారిక కార్యక్రమాల నిర్వహణతో ప్రముఖుల ప్రశంసలు

నాగర్‌కర్నూల్: గతేడాది జూన్ 16న బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ బదావత్ సంతోష్ పాలనలో తనదైన ముద్ర వేస్తున్నారు. నిబద్ధత, దార్శనికత, కఠోర శ్రమతో జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, ప్రభుత్వ పథకాల అమలులో ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లాలో కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న మరుసటి రోజు నుంచే ప్రతి పనిని తనదైన శైలిలో ఉత్తమంగా ఉండేలా ప్రయత్నిస్తున్నారు. నిత్యం సమీక్షలు, అభివృద్ధి పనుల పర్యవేక్షణ, క్షేత్రస్థాయి పర్యటనలు, ఇతరత్రా కార్యక్రమాల పరిశీలనతో పారదర్శకత పెంచుతున్నారు. ఊహించని విపత్తులు, అధిక వర్షాల వరదలు, ఎస్ఎల్‌బీసీ వంటి విపత్తులను సైతం సమర్థవంతంగా ఎదుర్కొంటూనే జిల్లా అభివృద్ధికి నిర్విరామంగా కృషిచేస్తున్నారు.

విద్యే మార్పునకు నాంది

కలెక్టర్ బదావత్ సంతోష్ విద్యే మార్పునకు నాంది అని భావించి.. జిల్లాలో విద్యా వ్యవస్థపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. ప్రభుత్వ విద్యాసంస్థలను ఆకస్మిక తనిఖీ చేస్తూ.. పాఠాలు బోధిస్తూ.. విద్యాలయాల్లో వసతులు పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్, మ్యాథ్స్, ఇంగ్లిష్ తదితర పాఠాలు సైతం బోధించి.. లక్ష్యం వైపు స్పష్టత ఇస్తూ భవిష్యత్ ప్రణాళికపై సూచనలు చేశారు. గతేడాది పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 23వ స్థానంలో జిల్లా ఈ ఏడాది 13వ స్థానానికి చేరుకోవడంలో కలెక్టర్ కృషి ప్రత్యేకమైనది.

⇨ ఇందిర సౌర గిరి జల వికాస పథకం ద్వారా పోడు భూములను వ్యవసాయ యోగ్యంగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి జిల్లాలోని అమ్రాబాద్ మండలం మాచారంలో సీఎం రేవంత్‌రెడ్డి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ పథకం ప్రారంభ ఏర్పాట్లను అతి తక్కువ సమయంలోనే విజయవంతంగా పూర్తిచేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ వారి ప్రశంసలు అందుకుంటూ ముందుకెళ్తున్నారు.

⇨ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించడానికి డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర వాటిని గాడిలో పెట్టేలా చొరవ తీసుకున్నారు.

⇨ జిల్లా జనరల్ ఆస్పత్రితోపాటు సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలను ఆకస్మికంగా సందర్శించి.. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచిస్తున్నారు. జనరల్ ఆస్పత్రి ఐసీయూలో బెడ్స్, డ్రగ్స్ అలాగే నిరంతరం శానిటేషన్ చేపట్టాలని, ప్రసూతి కోసం వచ్చే గర్భిణులకు సాధారణ కాన్పులకు ప్రాధాన్యత ఇచ్చేలా కృషి చేశారు. ఎప్పటికప్పుడు జనరల్ ఆస్పత్రిలోని సాధారణ, ఆర్థో వార్డులను తనిఖీ చేసి రోగులతో అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకుంటున్నారు.

⇨ కలెక్టరేట్‌లో అధికారులు సమయపాలన పాటించేలా బయోమెట్రిక్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. నిత్యం సమీక్షలు జరుపుతూ ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ వేగిరం చేశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా సత్వరమే పరిష్కరించాలని సూచిస్తున్నారు.

⇨ నల్లమల్ల ప్రాంతంలోని చెంచుల సంక్షేమం, అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కార్యాచరణ రూపొందించారు. చెంచుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్మన్ యోజన) పథకం ద్వారా జిల్లాలోని 88 చెంచుపెంటల్లో 11 రకాల కార్యక్రమాలు విడతల వారీగా చేపట్టారు. చెంచు పెంటల్లో 1,030 ఇళ్ల నిర్మాణం ప్రతిపాదించి పనులు ప్రారంభించారు. కొంతమంది చెంచులకు కిసాన్ క్రెడిట్, ఆయుష్మాన్ భారత్, ఆధార్ కార్డులు అందజేశారు. ప్రత్యేకంగా మెడికల్ వాహనం ఏర్పాటు చేశారు. మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి కలెక్టర్ ప్రతిపాదనలు పంపించారు.

కాంగ్రెస్‌తోనే రాజ్యాంగ పరిరక్షణ సాధ్యం



పాదయాత్రలో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు

కొల్లాపూర్ రూరల్: దేశంలో కాంగ్రెస్ పార్టీతోనే రాజ్యాంగ పరిరక్షణ సాధ్యమవుతుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం మండలంలోని ముక్కిడిగుండం గ్రామం నుంచి మొలచింతలపల్లి వరకు నిర్వహించిన జైభీమ్– జైబాపు యాత్రలో మంత్రి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆయా గ్రామాల్లో మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పాలాభిషేకాలు చేసి.. ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకే జైభీమ్– జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ వాటిని కాపాడే బాధ్యతను కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందన్నారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా ప్రజలను చైతన్యపరిచారని చెప్పారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే అందరికీ సమాన హక్కులు, అవకాశాలు లభిస్తున్నాయని వెల్లడించారు. పాదయాత్రలో భాగంగా మొలచింతపల్లి గ్రామానికి వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు దశాబ్దాల కాలంగా సాగునీరు లేక ముక్కిడిగుండం, మొలచింతపల్లి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చెంతనే కేఎల్ఐ ప్రాజెక్టు ఉన్నా సాగునీరు అందడం లేదని సీపీఐ మండల కార్యదర్శి శివుడు ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం అందజేశారు. సమస్య పరిష్కరించకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని మంత్రి సమక్షంలోనే పేర్కొన్నారు.

పెరిగిన పత్తి విత్తనాల ధరలు

- ఒక్కో పాకెట్‌పై రూ.37 పెంపు



మహబూబ్‌నగర్ (వ్యవసాయం): పత్తి రైతులపై కేంద్ర ప్రభుత్వం అదనపు భారం మోపింది. ఈసారి పత్తి విత్తనాల ధర పాకెట్‌పై రూ.37 పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది బీటీ–2 పత్తి విత్తనానికి ఒక పాకెట్‌కు రూ.864 ధర ఉండగా, ప్రస్తుతం రూ.37 పెంపుతో రూ. 901కి చేరింది. ఇప్పటికే మూడేళ్లుగా చీడపీడల బెడదతో పత్తి దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. మార్కెట్‌లో పత్తి ధర రూ.7 వేలకు మించి పలకకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. దీనికితోడు పంట దిగుబడి సైతం సరిగా రాలేదు. తాజా ధర పెంపుతో రైతులపై అదనపు భారం మోపినట్లయ్యింది. కాగా.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 3 లక్షలకుపైగా ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తారు. దీనికోసం 5 లక్షల వరకు విత్తన పాకెట్లు అవసరమవుతాయి.

ఉమ్మడి జిల్లాలోని నాగర్‌కర్నూల్, గద్వాల, నారాయణపేట, వనపర్తి జిల్లాలతోపాటు దేవరకద్ర, చిన్నచింతకుంట, మిడ్జిల్, మూసాపేట, అడ్డాకుల, నవాబుపేట, జడ్చర్ల, రాజాపూర్, బాలానగర్, భూత్పూర్ తదితర ప్రాంతాల్లో అత్యధికంగా బీటీ– 2 పత్తి సాగు చేస్తారు. ఇటీవల కురిసిన కొందరు రైతులు విత్తనాలు విత్తుకోగా.. మరికొందరు దుక్కులు దున్ని విత్తనాలు విత్తేందుకు భూమిని సిద్ధం చేసుకుంటున్నారు.

బీటీ-2 పత్తి విత్తనాల ధరలు ఇలా

సంవత్సరం	పాకెట్ ధర (రూ.లలో..)
2018	690
2019	710
2020	730
2021	767
2022	810
2023	853
2024	864
2025	901



చిన్నచింతకుంటలో సాగు చేసిన పత్తిపంట

రైతులకు చేరువగా రైతు నేస్తం

- జిల్లాలో అందుబాటులోకి రానున్న మరో 40 కేంద్రాలు
- ఇప్పటికే 20 రైతు వేదికల్లో అందుతున్న సేవలు
- నేడు జిల్లా రైతులతో ముఖాముఖిగా మాట్లాడనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఆధునిక పరిజ్ఞానంతో అన్నదాతలకు ప్రయోజనం



అచ్చంపేట మండలంలోని పులిజాల రైతు వేదిక

అచ్చంపేట రూరల్: కాలానుగుణంగా అన్నదాతలు సైతం ఆధునిక వ్యవసాయ విధానాలు అవలంబించాల్సి వస్తోంది. గ్రామీణ కర్షకులకు సలహాలు, సూచనలు అందిస్తే అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుంది. సరైన పరిజ్ఞానం లేక వ్యాపారులు సూచించిన సలహాలు పాటిస్తూ నష్టపోతుంటారు. మండల కేంద్రాల్లో ఉండే వ్యవసాయాధికారులను కలిసేందుకు వెళ్లడం కష్టంగా ఉండేది. దీనిని దృష్టిలో పెట్టుకొని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి క్లస్టరుకు ఒక రైతువేదిక నిర్మించింది. వాటిలో ఏఈఓలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతువేదికలను మరింత పటిష్టం చేసే దిశగా చర్యలు చేపట్టింది. ప్రతి మండలంలో రైతులకు అందుబాటులో ఉండేలా 'రైతునేస్తం' ద్వారా వీడియో కాన్ఫరెన్సు సైతం ఏర్పాటు చేశారు. జిల్లాలోని 20 మండలాల రైతు వేదికల్లో మొదటగా 20 వీసీలు అందుబాటులోకి తీసుకురాగా.. ప్రస్తుతం మరో 40 వీసీ కేంద్రాలను అందుబాటులోకి తేనుంది. ఈ మేరకు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని పలు జిల్లాలో వీసీ కేంద్రాలను ప్రారంభిస్తుండగా.. జిల్లాలోనూ 40 వీసీ కేంద్రాలను ప్రారంభించి.. 60 కేంద్రాల్లోని రైతులతో ముఖాముఖిగా మాట్లాడనున్నారు.

సాగు, పాడిపై సూచనలు

జిల్లాలోని రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా ఎరువుల యాజమాన్యం, వంగడాల ఎంపిక, కలుపు నివారణ, అధిక వర్షాల వేళ పంటల వారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలను వివరిస్తున్నారు. చిరుధాన్యాలు, వాణిజ్య పంటలు, కూరగాయల సాగు విధానాలను అడిగి తెలుసుకుని సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు. కాలానుగుణంగా పశువులకు అందించాల్సిన టీకాలపై సంబంధిత శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు వచ్చే రాయితీలు, దరఖాస్తు విధానాలను వివరిస్తున్నారు. తాజాగా మరిన్ని రైతు నేస్తం కేంద్రాలను విస్తరించడంతో మరింత మంది రైతులకు సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

ఆధునిక పరిజ్ఞానంతో..

వ్యవసాయ రంగంలో ఆధునిక పరిజ్ఞానం రైతులకు మరింత చేరువయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పంటల సాగులో మెలకువలు, ఆధునిక పద్ధతులపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంతో పాటు సందేహాలను నివృత్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది మార్చి నుంచి ప్రతి మంగళవారం 'రైతునేస్తం' కార్యక్రమం నిర్వహిస్తోంది. జిల్లాలోని 20 మండలాల్లో కేటాయించిన రైతు నేస్తం రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్సులను వ్యవసాయశాఖ నిర్వహిస్తోంది. రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్సుకు సంబంధించిన ఎలక్ట్రికల్ పరికరాలు కంప్యూటర్, మైకులు, ఇన్వర్టర్ బ్యాటరీలతోపాటు నెట్ కనెక్షన్ ద్వారా నిర్వహిస్తున్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు నేరుగా రైతులతో ముఖాముఖి నిర్వహించడంతోపాటు సాగులో మెలకువలు, వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, పంటల తెగుళ్ల నివారణ, చీడపీడల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆధునిక పద్ధతులు, యాంత్రీకరణ, నూతన వంగడాలపై రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ రంగంతోపాటు అనుబంధ రంగాలపై కూడా వీసీలో చర్చిస్తున్నారు.

రైతులకు ఎంతో మేలు..



రైతువేదికలకు వీడియో కాన్ఫరెన్సులు మంజూరు కావడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. జిల్లాలోని 20 మండలాల్లో ఇప్పటికే 60 రైతునేస్తం కేంద్రాలు మంజూరయ్యాయి. వీటి ద్వారా ఎప్పటికప్పుడు పంటల సాగులో మెలకువలను తెలియజేసే వీలుంటుంది. రైతులు రైతువేదికల వద్దకు వెళ్లి సద్వినియోగం చేసుకోవాలి. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి కార్యక్రమం ఉంటుంది. రైతులు అందరూ పాల్గొనాలి.

– చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయాధికారి

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



రీజియన్ నూతన కమిటీతో రాష్ట్ర ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని నూతన రీజియన్ కమిటీ అధ్యక్షుడు భాస్కరాచారి, ప్రధాన కార్యదర్శి సత్యశీలారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాష్ట్ర ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం చైర్మన్ రహమాన్ సోఫి, రాష్ట్ర అడిషనల్ సెక్రటరీ సత్యన్న ఆచారి, రాష్ట్ర కార్యదర్శి బసన్న ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా మహబూబ్‌నగర్ రీజియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. రీజియన్ అధ్యక్షుడిగా భాస్కరాచారి, ప్రధాన కార్యదర్శిగా సత్యశీలారెడ్డి, కోశాధికారిగా కేకే మూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాంమూర్తి, ఉపాధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి, చీఫ్ అడ్వయిజర్‌గా ఎంకే జోసెఫ్, జాయింట్ సెక్రటరీగా దమ్మాయిపల్లి శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో రీజియన్ పరిధిలోని పది డిపోలకు చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

చేపలు పట్టేందుకు వెళ్లి న్యాయవాది మృతి


తిరుపతయ్య (ఫైల్)

జడ్చర్ల: చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ న్యాయవాది ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృత్యువాత పడిన సంఘటన ఆదివారం జడ్చర్ల మినీ ట్యాంక్‌బండ్ నల్లచెరువులో జరిగింది. సీఐ కమలాకర్ కథనం మేరకు.. స్థానిక కావేరమ్మపేటకు చెందిన న్యాయవాది గుండు తిరుపతయ్య(55) ఆదివారం మినీ ట్యాంక్‌బండ్ వద్ద చేపలు పట్టే క్రమంలో కాలుజారి ప్రమాదవశాత్తు నీటిలో పడ్డాడు. ఈ క్రమంలో కణతకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించి స్థానికులు నీటి నుంచి బయటకు తీసేలోగా మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భవనంపై నుంచి దూకి వివాహిత బలవన్మరణం


ఆత్మహత్య చేసుకున్న అనూష

జడ్చర్ల: మూడంతస్తుల భవనంపై నుంచి దూకి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం బాదేపల్లి పట్టణంలో చోటుచేసుకున్నది. సీఐ కమలాకర్ కథనం ప్రకారం.. బాదేపల్లికి చెందిన అనూష(30) భర్త ఆంజనేయులు, తన ముగ్గురు పిల్లలతో కలిసి స్థానిక 4వ వార్డులోని మాధవరావు కాంపౌండ్‌లోని ఓ భవనంలో అద్దెకు ఉంటుంది. స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తూ కుటుంబానికి ఆసరగా నిలుస్తుంది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో తీవ్ర మనస్తాపానికి గురై భవనంపై నుంచి కిందకు దూకడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందింది. డబ్బుల కోసం భర్త వేధించడంతోనే తన కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లి ఆరోపించింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


మృతుడు మల్లేష్

మరికల్: తామర పూలను కోసేందుకు చెరువులో దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన ఘటన ఆదివారం పెద్దచింతకుంటలో జరిగింది. గ్రామానికి చెందిన బీరప్ప, మల్లమ్మ దంపతుల కుమారుడు మల్లేష్ (42) నిత్యం శివుడి పూజకు తామరపూలను తీసుకెళ్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం పూజకు తామరపూలు కోసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులోపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాము తెలిపారు.

ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య


శిరీష(ఫైల్)

వెల్దండ: మండలంలోని నారాయణపూర్‌తండాలో ఇస్లావత్ శిరీష(19) నీట్‌లో సీట్ రాలేదని ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఇస్లావత్ పాండు, చిట్టికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకున్నా.. నీట్‌లో సరైన మార్కులు సాధించలేదు. శనివారం వెలువడిన ఫలితాల్లో మార్కులు తక్కువ రాగా.. మానస్తానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పీర్ల పండుగను గుర్తించాలి: టీఎఫ్‌టీయూ



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పీర్ల పండుగను తెలంగాణ పండుగగా గుర్తించాలని టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో పీర్ల నిర్వాహకుల సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీర్ల పండుగ నిర్వహణ(మొహర్రం)లో ముజావర్లు, ముల్లాలు, సవారి ఎత్తేవారు, డప్పులు కొట్టే, భాజాభజంత్రీలు వాయించే కళాకారులు ఎలాంటి పారితోషికం లేకుండా సేవలు అందిస్తున్నారన్నారు. అనంతరం తెలంగాణచౌరస్తా వరకు ఊరేగింపుగా వెళ్లి కొద్దిసేపు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పీర్ల పండుగ నిర్వాహకుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గట్టన్న, సంఘం నాయకులు ముజీబ్, మద్దూర్ చారి, మహమ్మద్ రఫీ, సత్యనారాయణ, యాదయ్య, జలాల్‌పాషా, జాహెద్, టీఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్ పాల్గొన్నారు.

‘కురుమూర్తి’కి మహర్దశ


ఎలివేటెడ్ కారిడార్ ఘాట్‌రోడ్డు నిర్మాణ నమూనా

- రూ.110 కోట్లతో అభివృద్ధి పనులు
- ఎలివేటెడ్ కారిడార్ ఘాట్‌రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన అధికారులు


ఎలివేటెడ్ కారిడార్ ఘాట్‌రోడ్డు నిర్మాణానికి స్థలాన్ని చదును చేస్తున్న అధికారులు

చిన్నచింతకుంట: ఉమ్మడి జిల్లాలో పేదల తిరుపతిగా విరాజిల్లుతున్న అమ్మాపురం కురుమూర్తి స్వామి ఆలయ రూపురేఖలు మారనున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతేడాది జరిగిన స్వామి వారి బ్రహ్మోత్సవాలకు హాజరై ఘాట్ రోడ్ నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులకు రూ.110 కోట్లు మంజూరు చేయడంతో పాటు శంకుస్థాపనలు చేశారు. అధికారులు శనివారం ఘాట్ రోడ్డు నిర్మాణానికి స్థలాన్ని పొక్లెయిన్‌తో చదును చేయించారు. అలాగే ఆలయ పరిసరాల్లో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ఉద్దాల మండపం స్వామి వారి పాదుకల వరకు 20 పిల్లర్లతో ఎలివేటెడ్ కారిడార్.. అక్కడి నుంచి స్వామివారి ప్రధాన ఆలయం, కురుమూర్తి గిరుల వెనకభాగం నుంచి అమ్మాపురం సమీపంలోని ఆత్మకూర్, దేవరకద్ర ప్రధాన రహదారి వరకు ఘాట్ రోడ్డు నిర్మించనున్నారు. మొత్తం 2.850 మీటర్ల పొడవు, 20 ఫీట్ల వెడల్పుతో డబుల్ లైన్ రోడ్డు నిర్మాణం జరగనుంది. రోడ్డు నిర్మాణంతో భక్తులకు స్వామివారి దర్శనం సులభమవుతుంది.

ఎమ్మెల్యే సహకారంతో..



ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి సహకారంతో కురుమూర్తిస్వామి ఆలయం వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రస్తుతం రూ.110 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్, ఘాట్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నాం. అంతేగాక ఆలయం వద్ద మహా మండపం, విడిది సత్రాలు, అన్నదాన సత్రాలు, కల్యాణ మండపం నిర్మాణం చేపట్టనున్నాం.

– గోవర్ధన్‌రెడ్డి, చైర్మన్, కురుమూర్తిస్వామి ఆలయం

త్వరగా పూర్తి చేస్తాం..

కురుమూర్తిస్వామి ఆలయం వద్ద ఎలివేటెడ్ కారిడార్ ఘాట్‌రోడ్డు పనులు ప్రారంభించాం. ఆయా పనులకు రెండేళ్ల అగ్రిమెంట్ ఉంది. అంతలోగా పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– సంధ్య, డీఈఈ, ఆర్‌అండ్‌బీ

భక్తుల సౌకర్యార్థం..

అమావాస్య, ఏటా జరిగే బ్రహ్మోత్సవాలకు ఆలయానికి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఆయా సమయాల్లో మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సహకారంతో ఆలయ అధికారులు ప్రస్తుతం ఆలయం వద్ద ఎలివేటెడ్ కారిడార్, ఘాట్‌రోడ్డు నిర్మాణం, స్వామివారి ప్రధాన ఆలయం ఎదుట మహా మండపం, రాజగోపురం ఎదుట పీఎస్‌బీ షెడ్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే కలెక్టర్ ప్రత్యేక నిధులతో తాగునీటి ట్యాంకు నిర్మించారు. కల్యాణ మండపం, విడిది సత్రాలు, అన్నదాన సత్రాల నిర్మాణానికిగాను ఆలయం నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశారు.

వికసించిన బ్రహ్మ కమలాలు


జడ్చర్లలో వికసించిన బ్రహ్మ కమలాలు

జడ్చర్ల: హిందూ సంస్కృతిలో బ్రహ్మ కమలం మొక్కను చాలా పవిత్రమైందిగా భావిస్తారు. బ్రహ్మ కమలాలను శివుడికి సమర్పిస్తే ప్రసన్నమై కోరికలు నెరవేరుస్తారని శివ భక్తుల విశ్వాసం. ఎక్కువగా హిమాలయాలు, ఉత్తర బర్మా, టిబెట్, నేపాల్, చైనా దేశాల్లో పెరిగే బ్రహ్మకమలాలు జడ్చర్లలో ఆదివారం రాత్రి వికసించాయి. స్థానిక శ్రీనివాస థియేటర్ సమీపంలో నివాసముంటున్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి మల్లికేడి కొండాజీ, విజయలక్ష్మి దంపతుల ఇంటిలో ఏకంగా 14 పుష్పాలు వికసించాయి. దీంతో కుటుంబ సభ్యులు బ్రహ్మకమలాలకు ప్రత్యేక పూజలు చేశారు. విషయం తెలుసుకున్న చుట్టు పక్కల వారు బ్రహ్మకమలాలను చూసి సంబురపడ్డారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌తో గొడవ..పోలీసులకు ఫిర్యాదు


పోలీస్ స్టేషన్ వద్ద నిలిపిన ఆర్టీసీ బస్సు

జడ్చర్ల: ఆర్టీసీ బస్సులో ఓ మహిళా ప్రయాణికురాలికి బస్సు డ్రైవర్‌కు మధ్య గొడవ జరగగా చివరకు పంచాయితీ పోలీస్ స్టేషన్‌కు చేరిన ఘటన ఆదివారం జడ్చర్లలో చోటు చేసుకుంది.సీఐ కమలాకర్ కథనం మేరకు.. హైదరాబాద్–2 ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు కొల్లాపూర్ బయలుదేరింది. జడ్చర్లలోని శ్రీనివాస కాలనీకి చెందిన అనసూయ అనే ప్రభుత్వ ఉద్యోగిని బస్సు ఎక్కింది. బస్సు పుట్‌బోర్డుపై నిలబడడంతో బ్రేక్ వేస్తే కింద పడిపోయే ప్రమాదముందని డ్రైవర్ ఆమెను హెచ్చరించాడు. దీంతో ఆగ్రహించిన ఆమె ఒక్కసారిగా డ్రైవర్‌పై మండిపడింది. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. దీంతో బస్సును మార్గమధ్యలోని పోలీస్ స్టేషన్ వద్ద ఆపి పోలీసులకు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగడంతో పోలీసులు ఇద్దరిని విచారించి బస్సును పంపించి వేశారు.

దక్షిణాఫ్రికాలో క్రికెట్ టోర్నీకి మహ్మద్ ఖయ్యూం

గద్వాలటౌన్ : దక్షిణాఫ్రికాలో జరగనున్న క్రికెట్ టోర్నీకి గద్వాలకు చెందిన యువ క్రీడాకారుడు మహ్మద్ ఖయ్యూం ఎంపికయ్యారు. రెండు నెలల పాటు జరిగే కార్వాన్స్ టీ20 సిరీస్‌కు టాంజానియా క్రికెట్ అసోసియేషన్ తరఫున మహ్మద్ ఖయ్యూం ఆడనున్నారు. గతంలో ఖయ్యూం మొయినుద్దౌలా గోల్డ్ కప్‌లో ఆడారు. దీంతో పాటు హెచ్‌సీఏ తరపున అండర్–16, 19 కంబైన్డ్ జిల్లాల జట్టుకు ప్రాతినిథ్యం వహించారు. ఎస్‌జీఎఫ్ పోటీలలో ఉమ్మడి రాష్ట్రం తరపున ఆడారు. అనేక రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటడడంతో టాంజానియా క్రికెట్ అసోసియేషన్ టోర్నీకి ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆదివారం ఇండోర్ స్టేడియంలో మహ్మద్ ఖయ్యూంను విశ్రాంత డీవైఎస్‌ఓ బీఎస్ ఆనంద్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్ చంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి పట్వారీ వెంకటేశ్‌లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ హరిబాబు, హుస్సేన్, ఖలీం తదితరులు పాల్గొన్నారు.

మోదీపూర్‌లో ట్రాక్టర్ చోరీ



కోయిల్‌కొండ: మండల పరిధిలోని మోదీపూర్ గ్రామానికి చెందిన మైపాల్‌గౌడ్‌కు చెందిన ట్రాక్టర్ శనివారం రాత్రి చోరీకి గురైంది. రైతు మైపాల్‌గౌడ్ 15 రోజుల క్రితం రూ.12 లక్షలు పెట్టి ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం వ్యవసాయ పనుల అనంతరం తన కిరాణషాపు ముందు నిలబెట్టాడు. ఉదయం లేచి చూసేసరికి ట్రాక్టర్ కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపాజీ తెలిపారు.

కోయిల్‌సాగర్ పరిసరాల్లో చిరుత సంచారం


కోయిల్‌సాగర్ సమీపంలోని గుట్టల మధ్య కనిపిస్తున్న చిరుత

దేవరకద్ర: కోయిల్‌సాగర్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం చిరుత సంచారం కనిపించిందని గ్రామస్తులు తెలిపారు. గతవారం చిన్నరాజమూర్ పరిసరాల్లో సంచరించి ఒక ఆవును చంపి తిన్నది. తిరిగి వారం తర్వాత కోయిల్‌సాగర్ పరిసరాల్లో మళ్లీ చిరుత సంచరించడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కోయిల్‌సాగర్ ఈర్లగట్టు, ఊరగట్టు ప్రాంతాల్లో పగలే చిరుత కనిపించిందని పశువుల కాపర్లు తెలిపా రు. ఈ ప్రాంతాల్లో ఉండే రైతులు, పశువుల కాపర్లు అప్రమత్తంగా ఉండాలని గ్రామపెద్దలు కోరారు.

సోయాబీన్‌లో యాజమాన్య పద్ధతులు


సోయా పంట సాగు (ఫైల్)


సోయాబీన్ కాయలు (ఫైల్)

పాడి-పంట

జిల్లా వ్యవసాయాధికారి, సక్రియానాయక్

అలంపూర్: నైరుతి రుతుపవనాల రాకతో వానలు కురుస్తుండడంతో రైతులు సాగుకు సిద్ధం అవుతున్నారు. నల్లరేగడి నేలల్లో పత్తికి ప్రత్యామ్నాయంగా సోయాబీన్ పంటను సాగు చేసుకోవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియానాయక్ రైతులకు సూచించారు. కందిలో సహాయ పంటగా, పండ్ల తోటలో అంతర్ పంటగానూ సోయాబీన్ విత్తుకోవచ్చన్నారు.

నేలలు.. మురుగు నీరు పోయే వసతి ఉండి, తేమను నిలుపుకోగల భూములు అనువైనవి.

రకాలు.. జేఎస్–335, ఎల్ఎస్‌బీ–1, పీకే–472 ఇందులో జేఎస్ 335 రకం ప్రసిద్ధి చెందింది.

పంట కాలం.. సోయాబీన్ పంట కాలం 100 నుంచి 110 రోజులు

పంట వేసే పద్ధతి.. సోయాను పత్తి, కందిలో అంతర్, మిశ్రమ పంటగా వేయవచ్చును. వానాకాలంలో సోయా సాగు తర్వాత రబీలో శనగ, మినుములు వేసుకోవచ్చు.

విత్తనం.. విత్తనం ఎకరానికి 25 నుంచి 30 కిలోలు అవసరం. విత్తనాన్ని 45 ఇంటూ 5 సెంటీమీటర్ల దూరంలో వరుసకు వరసలోని మొక్కల మధ్య 3 సెంటీమీటర్ల లోతులో మొత్తటి దుక్కిలో నాటు వేసుకోవాలి.

విత్తే కాలం : జూన్ రెండో వారం నుంచి జూలై మొదటి వారం వరకు సోయాబీన్ విత్తడానికి అనుకూలం.

పంట కోత ఆకులు పసుపు పచ్చ రంగులోకి మారి, రాలిపోవడం మొదలైనప్పుడు లేదా కాయలు ఆకుపచ్చ నుంచి బూడిద రంగులోకి మారినప్పుడు కోయాలి. కోత ఆలస్యం అయితే కాయలు చిట్లి గింజలు రాలిపోతాయి. పంట కోసిన తర్వాత 2 నుంచి 3 రోజులు ఆరనిచ్చి గింజలోని తేమ శాతం 14 వరకు చూసి నూర్పిడి చేయాలి.

దిగుబడి సోయా సాగుకు ఎకరానికి రూ.8 వేల వరకు ఖర్చు అవుతుంది. మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి పొందవచ్చు.

కలుపు నివారణ.. సోయాలో మొదటి 45 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి. విత్తిన 20 రోజులకు ఎకరానికి 250 మి.లీ ఇమాజిత్ పైర్ అనే కలుపు మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవడం ద్వారా కలుపును నివారించొచ్చు.

ఎరువులు.. ఎకరానికి 25 కిలోల యూరియా, 150 కేజీల సూపర్, 25 కిలోల పొటాష్ అవసరం. విత్తేటప్పుడు ఫోరేట్ 10 జీ గుళికలు ఎకరానికి 4 కిలోలు చొప్పున వాడితే కాండపు ఈగలాంటి పురుగును నివారించుకోవచ్చు.

కృష్ణానదిలో మునిగిన పంటలు


మంచాలకట్టలో కృష్ణానదిలో మునిగిన పంటను ట్రాక్టర్ ద్వారా తీసుకొస్తున్న రైతులు, కూలీలు

- నీట మునిగిన పంటలు
- నదిపరివాహక ప్రాంత రైతులు పాట్లు


జటప్రోల్‌లో కృష్ణానదిలో మునిగిన నువ్వులపంట

పెంట్లవెల్లి: మండలంలోని కృష్ణానది పరివాహక ప్రాంతం మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోల్, వే ముకల్ గ్రామాల ప్రజలు ప్రతి సంవత్సరం కృష్ణా నది తీరాన వందలాది ఎకరాలు నువ్వులు, మినుములు, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేస్తుంటారు. ఈ సంవత్సరం కూడా ఎ ప్పటిలాగే పలు రకాల పంటలు కృష్ణానది తీరంలో ఒండ్రుమట్టి పొలాల్లో సాగు చేశారు. ఈ పొలాలు కృష్ణానది నీరు తీసిన తర్వాత పంటలు సాగు చేస్తా రు. ఎప్పటిలాగే ఇప్పుడు కూడా పంటలు సాగు చేశారు. కానీ ఈ సంవత్సరం మందస్తుగా వర్షాలు పడుతున్నాయి. మరోవైపు జూరాల ప్రాజెక్ట్ నుంచి దిగువకు కృష్ణానది నీరు ప్రవహిస్తోంది. దీంతో వందల ఎకరాల పంటలు నీటిలో మునుగుతున్నాయి. కోసిన పంటల కుప్పలు రాల్పడానికి రోజూ వర్షాలు పడడంతో రైతులు ఇ బ్బందులు పడుతున్నారు. మరో వైపు చేతికి వచ్చిన పంట నీళ్లలో మునిగిపోతుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దాదాపు ఎకరా సాగు చేయడానికి కౌలుతో కలిపి రూ.60 వేలు అవుతోంది. అలా 5, 10 ఎకరాలు సేద్యం చేసిన రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొంత మంది రైతులు నీటిలో మునుగుతున్న పంటను ట్రాక్టర్‌ల ద్వారా కూలీలతో నీటిలో నుంచి బయటకు తీసుకొస్తున్నారు.

సండే.. కాసేపు సరదాగా..


జూరాల దిగువ భాగంలో పర్యాటకుల సందడి

- జూరాలకు సందర్శకుల తాకిడి
- దిగువ భాగాన పిల్లాపాపలతో సెల్ఫీలు


జూరాల దిగువ భాగంలో పర్యాటకులు

అమరచింత: జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద తాకిడి మొదలైంది. ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తున్నది. జలాశయం అందాలను వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివస్తున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో సందర్శకులు సరదాగా గడిపారు. ఎగువ భాగంలో జలాశయం అందాలను చూస్తూ.. దిగువన నదీలోపలికి వెళ్లి పిల్లాపాపలతో సెల్ఫీలు దిగారు. సెల్ఫీల మోజులో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా పోలీసులు పహారా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.


సరదాగా ఫొటోలు దిగుతున్న మహిళలు


ఈత కొడుతున్న చిన్నారులు

జూరాలకు 21 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


దిగువ జూరాల పవర్‌హౌజ్‌లోకి చేరుతున్న వరద

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 21 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నట్లు పీజేపీఅధికారులు తెలిపారు. శనివారం 15వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఆదివారం రాత్రి 9 గంటలకు 21వేల క్యూసెక్కులకు పెరిగిందని పేర్కొన్నారు. విద్యుదుత్పత్తి కోసం 15,804 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 1,500 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 57 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 17,676 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం6.081 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జన్‌కో ఎగువ, దిగువ జల విద్యుత్‌కేంద్రంలో 8 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపడుతున్నట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 4 యూనిట్ల ద్వారా 156 మెగావాట్లు, 22.448 ఎంయూ, దిగువలో 4 యూనిట్ల ద్వారా 160 మెగావాట్లు, 24.376 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్ప టివరకు 46.824 ఎంయూ విజయవంతంగా విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు.

బైక్‌ను తప్పించబోయి చెట్టును ఢీకొట్టిన కారు


కొత్తకోట సమీపంలో రోడ్డు కిందకు దూసుకెళ్లిన కారు

కొత్తకోట రూరల్: బైక్‌ను తప్పించబోయిన కారు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్‌కు చెందిన మణికంఠ చిత్తూర్ జిల్లా మదనపల్లికి చెందిన ఓ యువతితో నెల రోజుల క్రితం వివాహం జరిగింది. అత్తగారి ఇంటి నుంచి భార్యను, బామర్ది, అత్త, తల్లితో కలిసి మణికంఠ ఆదివారం ఉదయం మదనపల్లి నుంచి హైదరాబాద్‌కు కారులో బయలుదేరారు. కొత్తకోటకు చెందిన రాధమ్మ, కుమారుడు కళ్యాణ్‌కుమార్‌రెడ్డి బైక్‌పై పెబ్బేరు మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గల బంధువుల ఇంటికి వెళ్లారు. వారు తిరిగి కొత్తకోటకు వస్తుండగా ఎన్‌హెచ్44 మదర్‌థెరిస్సా జంక్షన్ సమీపంలో పట్టణంలోకి మలుపుతుండగా.. అటు నుంచి అతి వేగంగా వచ్చిన కారు బైక్‌ను తప్పించే క్రమంలో అదుపు తప్పి రోడ్డుకు కిందకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టింది. బైక్ సైతం అదపు తప్పి కింద పడటంతో కళ్యాణ్‌కుమార్‌రెడ్డి, రాధమ్మకు గాయాలయ్యాయి. కారులో ఉన్న ఐదుగురికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.